క్లుప్తంగా

కూలీలను పెంచకపోతే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో ఉపాధి పనుల కూలీల సంఖ్యను పెంచకపోతే చర్యలు తప్పవని పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం వీయస్‌పురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, సమస్యలు తెలుసుకున్నారు. మండలంలో 4 వేల మంది కూలీలు పనిచేయాల్సి ఉండగా 2,200 కూలీలు మాత్రమే పనిచేస్తున్నారన్నారు. కూలీల సంఖ్యను పెంచకపోతే క్షేత్ర, సాంకేతిక సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ప్రతి పంచాయతీలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. అనంతరం కాటూరులో పల్లెపండుగ కార్యక్రమంలో వేస్తున్న సిమెంట్ రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ నాగరాజు, ఏపీఓ భానుప్రియ, క్షేత్ర, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ



ఏర్పేడు : భూమిపూజ చేస్తున్న హెచ్‌ఎం

రేణిగుంట(ఏర్పేడు) : తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి చొరవతో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారానికి బీజం పడింది. ఏర్పేడు మండలం పల్లం ఉన్నత పాఠశాలలో 180 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. చాలా కాలంగా బాలికలకు మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీగల ఆనంద్ తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి దృష్టికి తీసుకెళ్లి బాలికల సమస్యను వివరించారు. దీంతో వెంటనే ఆయన ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపిన ఎంపీకి విద్యార్థినులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, రాజా, రమణయ్య నాయుడు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఉత్సవం



పుర వీధుల్లో ఊరేగుతున్న అమ్మవారు

సత్యవేడు : పట్టణంలో శ్రీ లక్ష్మీ పేరంటాలమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయంలో పేరంటాలమ్మకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లాపు వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు ఆలయ పరిసరాలలో పొంగళ్లు, అమ్మవారికి చీర, సారే పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

నారాయణవనం : అందరినీ కలుపుకుని, పూర్తి సహకారంతో అభివృద్ధి సాధించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. రూ.7లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మండల విద్యావనరుల కేంద్రం ప్రహరీని ప్రారంభించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందివ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ జయరాములు, ఎంఈఓ ప్రభాకర్‌రాజు, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవనం స్వాధీనానికి ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న డీఎల్‌డీఓ జాలిరెడ్డి

వరదయ్యపాళెం : మండలంలోని ఇందిరానగర్ సచివాలయ భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆ భవనంలోనే సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ జాలిరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం నిరుపయోగంగా ఉంచడంపై తక్షణమే భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్‌ను ఆదేశించారు. స్థానిక సర్పంచ్ ద్వారా విద్యుత్ సౌకర్యం, ఇతర వసతులను ఏర్పాటు చేయాలని కోరారు.

ముక్కంటి సేవలో పీఠాధిపతి

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం హంపి పీఠాధిపతి విద్యారణ్యస్వామి దర్శించుకున్నారు.

జరిమానా

శ్రీకాళహస్తి: పట్టణంలో మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడిన వారికి న్యాయస్థానం ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించింది.

మార్కులు పదిలం

- పదో తరగతిలో శతశాతానికి కసరత్తు
- ఉత్తీర్ణతతోపాటు మార్కులపై శ్రద్ధ
- 50 రోజుల సన్నద్ధతకు సూచనలు



బుచ్చినాయుడుకండ్రిగలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ : విద్యార్థుల భవిష్యత్తుకు దిక్సూచి పదో తరగతి.. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థుల ఉత్తీర్ణతే కాక అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించడంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అందుకు చక్కని ప్రణాళికతో ముందుకు సాగాలని చెబుతున్నారు. ఉత్తమ ఫలితాలు సాధనే లక్ష్యంగా ఎక్కువ మార్కులు సాధించడంపై గురి పెట్టాలి.. నిపుణులైన ఉపాధ్యాయులు పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధనకు పలు సూచనలు చేశారు. ఆ వివరాలు మీకోసం ఇలా..

భౌతికశాస్త్రం అవగాహనతో చదవాలి



భౌతిక శాస్త్రం అంటే చాలా కష్టమని కొంత మంది విద్యార్థులు అపోహ పడుతుంటారు. కానీ అవగాహన, ప్రణాళికతో చదివితే భౌతికశాస్త్రంలో మంచి మార్కులు సాధించవచ్చు. రసాయన చర్యలు, సమీకరణాలు, ఆమ్లాలు, క్షారాలు, మానవుని కన్ను, రంగుల ప్రపంచం, లోహాలు, అలోహాలు, ఎలక్ట్రిసిటీ, కార్బన్ దాని సమ్మేళనాలు తదితర పాఠ్యాంశాలను క్షుణంగా చదివితే భౌతిక శాస్త్రంలో కచ్చితంగా మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. అంతేకాకుండా స్కూల్ ఎడ్యుకేషన్ సరఫరా చేసిన సక్సెస్ క్వశ్చన్ బ్యాంకులో పాఠ్యాంశాల వారీగా ఇచ్చిన ప్రశ్నలను చక్కగా చదివితే పదో తరగతిలో విజయం సాధించడం తేలిక అవుతుంది.

– దేవీప్రసాద్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, కల్లివెట్టుహైస్కూల్

తెలుగులో భాషాంశాలపై పట్టు



తెలుగు పాఠ్యాంశానికి సంబంధించి అవగాహన ప్రతిస్పందనకు 32 మార్కులకు గాను పరిచిత పద్యాలైన ఆటవెలది, తేటగీతి, కందం పద్యాల ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. వ్యక్తీకరణ సృజనాత్మకతకు 36 మార్కులకు గాను పద్యభాగం నుంచి కవి పరిచయం, గద్య భాగం నుంచి ప్రక్రియ, నేపథ్యం అడుగుతారు. భాషాంశాలు 32 మార్కులకు గాను పద్య, గద్య భాగాల్లోని పదజాలం, వ్యాకరణాంశాలు పాఠంలోనివి, పద విజ్ఞానంలోనివి అడుగుతారు. మొత్తం 100 మార్కులు ప్రశ్నాపత్రంలో భాషాంశాలైన పదజాలం, వ్యాకరణంపై విద్యార్థులు పట్టు సాధిస్తే మాతృభాష తెలుగులో అక్షర దోషాలు లేకుండా దస్తూరి బాగా ఉంటే 100 మార్కులు సాధించవచ్చు.

– యువశ్రీమురళి, తెలుగు ఉపాధ్యాయుడు, కల్లివెట్టుహైస్కూల్

గణితం.. సాధనతో సులభం



గణితంలో విద్యార్థులు మొత్తం 14 పాఠ్యాంశాలలో కేవలం ఆరు పాఠ్యాంశాలు చదివితే చాలు 60 మార్కులు పైగా మార్కులు తెచ్చుకోవచ్చు. ముఖ్యంగా సంభావ్యతలు, సాంఖ్యకశాస్త్రం, వాస్తవ సంఖ్యలు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాల జత, అంక శ్రేఢులను శ్రద్ధగా నేర్చుకుంటే 40 మార్కుల వరకు తెచ్చుకోవచ్చు. పిల్లలు అన్ని చాప్టర్లలో సూత్రాలు నిర్వచనాలు, భావనలపై పట్టు సాధించాలి. వాస్తవ సంఖ్యలు, శ్రేఢులు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాలు జత, సాంఖ్యక శాస్త్రము, సంభావ్యతలు, నిరూపక రేఖాగణితము, అంకశ్రేఢులలో 8 మార్కుల ప్రశ్నలు ఐదు తప్పనిసరిగా వస్తాయి.త్రికోణమితి, క్షేత్రగణితములోని 4 మార్కులు ప్రశ్నలు వస్తాయి. మాదిరి ప్రశ్నాపత్రాలు, ప్రీ ఫైనల్ పేపర్‌ను అధ్యయనం చేస్తే 100 మార్కులు సాధించవచ్చు.

– రవి, గణిత ఉపాధ్యాయుడు, పల్లమాల హైస్కూల్

ఆంగ్లం భయం వదలితే సులువే..



ఆంగ్లంలో మంచి మార్కులు సాధించేందుకు ప్రశ్న సంఖ్య 20 రిపోర్టెడ్ స్పీచ్, ప్రశ్న సంఖ్య 22 ఎడిటింగ్ ప్యాసేజ్ కోసం టెన్స్ , ప్రశ్న సంఖ్య 32ను శ్రద్ధగా ప్రాక్టీస్ చేసి ఇతర ప్రశ్న సంఖ్యలను ఏవీ వదలకుండా రాసి, తరువాత సెక్షన్ సీ నందు ప్రశ్న సంఖ్య 35 బీ, 36 ఏ, 37 ఏ,బీ, ని ప్రాక్టీస్ చేసి కాంప్రహెన్షన్ ప్యాసేజ్‌లను ప్రాక్టీస్ చేయడం వల్ల 90 మార్కులకు పైగా ఆంగ్లంలో సాధించవచ్చు. అలాగే వెనుకబడిన విద్యార్థులు ప్రశ్న సంఖ్య 17,18, 24, 32లను బాగా ప్రాక్టీస్ చేసి సెక్షన్ సీ, ఏ బాగా ప్రయత్నం చేస్తే 50 మార్కులు పైగా సులభంగా సాధించడానికి వీలుంటుంది. విద్యార్థులు భయంతో కాకుండా బాధ్యతతో చదవాలి.

– వేణుగోపాల్ , ఆంగ్ల ఉపాధ్యాయుడు, కల్లివెట్టుహైస్కూల్

మ్యాప్‌లపై అవగాహన



సాంఘిక శాస్త్రంలో బ్లూప్రింట్ ప్రకారం చదివితే సులభంగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించవచ్చు. కొన్ని పాఠాలలో మాత్రమే 1 , 2 మార్కులు ప్రశ్నలు ఉంటాయి. మరికొన్ని పాఠాలలో 4 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. అలాగే 8 మార్కులలో అంతర్గత ఛాయిస్ ఉంటుంది. ప్రపంచ పటం, భారత దేశ పటాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉంటే ఇచ్చినవి సులభంగా గుర్తించవచ్చు. పాఠ్యాంశాలపై అవగాహనతో శ్రద్ధగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు.

– నాదెండ్ల మురళి, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు, కల్లివెట్టు హైస్కూల్

భక్తిశ్రద్ధలతో పొంగళ్లు

నాగలాపురం : మండలంలోని రెడ్డివీధిలోని శ్రీ కావమ్మ సమేత మారయ్య ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయ ప్రాంగణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు గోవిందుడు, చెంగల్‌రాయులు, నాగరాజు, దేశయ్య, యువకులు దేవా, బాబీ పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాళహస్తి : సివిల్ సప్లై హమాలీల సమస్యలను పరిష్కరించాలని పట్టణంలోని సివిల్ సప్లై పాయింట్‌లో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అయ్యప్ప మాట్లాడుతూ.. కూలీ ధరలు పెంచి జీవోను విడుదల చేయాలన్నారు. పని బిల్లు ప్రతి నెలా 10వ తేదీ లోపు హమాలీల ఖాతాలో జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో జనమాల గురవయ్య, గోపి, శివకుమార్, చారుశీల, గోదాము మేస్త్రి గిరి, రుక్కు, బాబురాజ్ పాల్గొన్నారు.

యువతికి తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): తిరుపతి–చెన్నై రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. రేణిగుంట మండలం, గాజుల మండ్యం దళితవాడ వద్ద శుక్రవారం తిరుపతి–చెన్నై రహదారిపై తిరుపతి నుంచి పుత్తూరు వైపు వెళుతున్న స్కూటీని వెనుక వైపు గా తిరుపతి నుంచి సత్యవేడు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న సీజ కళ్యాణి, అజిత రాణికి గాయాలయ్యాయి. అందులో బీఎస్సీ చదువుతున్న అజిత రాణి వెన్నెముకకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

మాక్ రాజ్యాంగ పరిషత్ సమావేశం



మాదిరి సమావేశం నిర్వహిస్తున్న విద్యార్థులు

సత్యవేడు : బాలుర ఉన్నత పాఠశాలలో మాదిరి రాజ్యాంగ పరిషత్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలోని సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాదిరి భారత రాజ్యాంగ పరిషత్ సభ- సమావేశాల నిర్వహణ తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సభ్యుల ఎన్నిక, అధ్యక్షుడు, డ్రాఫ్ట్ కమిటీ సభ్యుల ఎన్నిక విధానాలను విద్యార్థుల ద్వారా ప్రదర్శించారు. రాజ్యాంగ పరిషత్ సభ్యుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి, హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టకు ట్రెంచ్‌ల ఏర్పాటు

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం కొత్తవీరాపురం సమీపంలోని స్వర్ణముఖీ నదిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో శుక్రవారం తహసీల్దార్ భార్గవి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది జేసీబీ సాయంతో ట్రెంచ్‌లను తవ్వారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలించటానికి వస్తే వారిని అడ్డుకుని, తమకు ఫిర్యాదు చేయాలని గ్రామస్తులను కోరారు.



కొత్తవీరాపురంలోని నదిలో ట్రెంచ్‌లను తవ్విస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఈ రోడ్డంతా నాదే!

- నడిరోడ్డుపై తాగుబోతు వీరంగం

శ్రీకాళహస్తి : పట్టణంలో తాగుబోతుల వీరంగం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఓ తాగుబోతు బాబు అగ్రమారం ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా పడుకుని వాహనాలు వెళ్లకుండా రభస సృష్టించాడు. దీంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.అతనిని పక్కకు తీయడానికి వెళ్లిన వారిపై దాడికి దిగాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మద్యం దుకాణాలకు విచ్చలవిడిగా పర్మిట్ రూములు ఏర్పాటు కావడంతో పట్టణంలో తరచూ ఎక్కడో ఒక దగ్గర తాగుబోతులు ఇలా వీరంగం చేస్తు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.



రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

రేణిగుంట(ఏర్పేడు): చౌక దుకాణం డీలర్లు కార్డుదారులకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఏర్పేడు తహసీల్దార్ భార్గవి ఆదేశించారు. కార్యాలయంలో శుక్రవారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. డీటీ రోజారమణి, ప్రేమ్‌సాయి శ్రీనివాస్, ఆర్ఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి : నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1, 2, 3వ తేదీలలో జరిగే సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శుక్రవారం రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

నారాయణవనం : నెల్లూరులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పాలమంగళం ఉత్తరపు కండ్రిగలో ఆ పార్టీ మండలశాఖ నాయకులతో కలిసి గోడపత్రికలను ఆవిష్కరించారు. సమగ్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం, సామాజిక సాధన ప్రధాన అజెండాతో మహాసభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు మునిశంకర్, మునేంద్ర, రాణమ్మ, హరి, చెంచయ్య, వరదరాజులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

మాతా,శిశు మరణాల నివారణే లక్ష్యం

శ్రీకాళహస్తి : మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గజేంద్రనగర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణి , బాలింతలు రక్తహీనతతో మరణించరాదన్నారు. వారికి తగిన వైద్యసదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి ప్రసవం ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరగాలన్నారు. అంగన్‌వాడీలో అందించే పోషక పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో అధికారులు నాగేంద్రకుమార్, నరేష్, ఇన్‌చార్జి సూపర్‌వైజర్ నరేష్, వైద్యులు ప్రవంతి, నయనార్, సీవో రేవతి పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వరదయ్యపాళెం : ఇళ్ల పరిసరాల్లో వ్యర్థపు నీటి నిల్వలను ఉంచుకోవద్దని మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్ సూచించారు. శుక్రవారం మండలంలోని చిన్న పాండూరు పంచాయతీలోని జంగం పాళెంలో ఇంటింటికీ వెళ్లి విష జ్వరాలు, ఇతర వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇళ్ల పరిసరాల్లో ఖాళీ రోళ్లు, ప్లాస్టిక్ డబ్బాలు, టైర్లు వంటి వాటిల్లో వర్షపు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, ఆ నీటి నిల్వలతోనే లార్వా ఉత్పత్తితో దోమల విస్తరణ, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. పలు ఇళ్ల వద్ద ఉన్న వ్యర్థపు నీటి నిల్వలను సిబ్బందితో కలిసి బయటకు పారబోశారు. ఎంపీహెచ్‌ఓ రవీంద్రుడు, సూపర్‌వైజర్ పవనకుమారి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

చదువుతో అమ్మాయిల్లో ఆత్మస్థైర్యం



బాలికా దినోత్సవంలో డాక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు

సత్యవేడు : చదువుతో ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం దాసుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆడపిల్ల అంటే కేవలం బానిసత్వం, బరువుగా చూసే మనస్తత్వం నుంచి బయటకు వచ్చే ప్రయత్నాల్లో భాగంగానే ఈరోజు జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఆడపిల్లలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వడివేలు, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : బాలికలు అవకాశాలను అందిపుచ్చుకుని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యమున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగలాపురం : మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ శ్రీలత ఆధ్వర్యంలో పిచ్చాటూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అధ్యక్షతన జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుండేలా తల్లిదండ్రులు తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వృక్షశాస్త్ర అధ్యాపకులు హిమబిందు పాల్గొన్నారు.

రేణిగుంట(ఏర్పేడు) : బాలికలు భావి సమాజానికి దిక్సూచీలని ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష అన్నారు. ఏర్పేడు మండలం పంగూరు హైస్కూల్ ఆవరణలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం బాలికా విద్య, ఆరోగ్యం, భద్రత, వారి సాధికారతను గురించి అవగాహన కల్పించారు.

- మండలంలోని పాపానాయుడుపేట ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 దయాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భారతి, రత్నమ్మ ప్రగతి కోఆర్డినేటర్ సుభాష్, సిబ్బంది వెంకటేష్, మురగయ్య, సుమలత, రాజేశ్వరి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా ఆరోగ్య శాఖ డిప్యూటీ డెమో కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ, మానవ హక్కులు, సామాజిక అభివృద్ధి, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి రవిబాబు, సంస్థ ఈసీ మెంబర్ డాక్టర్ కోదండరామిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ రాస్ చైల్డ్ ఫండ్ సంయుక్త ఆధ్వర్యంలో రేణిగుంట మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశంలో డీసీపీఓ శివశంకర్ , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి , రాస్ బాలాజీ బాలవికాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఆడపిల్లల హక్కుల గురించి వివరించారు.



రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో ..



ఏర్పేడు : మాట్లాడుతున్న శిరీష

- మండలంలోని కరకంబాడి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ పాల్గొని బాలికా విద్య ఆవశ్యకత గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి, ప్రగతి మండల కోఆర్డనేటర్ జయలక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలుగా ప్రజాప్రతినిధులు

- అధికారుల తీరుపై మండిపడిన సభ్యులు

నారాయణవనం : ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా కాకుండా ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులుగా అధికారులు గుర్తించాలని ఎంపీపీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మినీ గోకులం, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఉపాధి అధికారులు సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయడం, గ్రామసభలు నిర్వహించడంపై సర్పంచ్‌ల ఫిర్యాదుతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సభ ప్రారంభంలో హాజరై మాట్లాడుతూ.. అడ్డంకులు లేకుండా ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. శ్మశాన వాటికలకు స్థలాలను గుర్తించి, కేటాయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో పనులు, పథకాలను అధికార, ప్రతిపక్ష పార్టీలకు సమ ప్రాధాన్యం కేటాయించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో గుణశేఖర్, తహసీల్దార్ జయరాములు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఏపీవోను ప్రశ్నిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

సమావేశంలో చర్చించిన ముఖ్య అంశాలు

- మండలంలోని కై లాసనాథకోనలో అనాధికారికంగా నిర్వహిస్తున్న రిసార్ట్‌లకు, అక్రమ కట్టడాలపై నోటీసులు అందజేసి మూసివేయాలని కార్యదర్శికి సూచించారు. రిసార్ట్‌లు వాడుకుంటున్న డొమెస్టిక్ కరెంట్ సర్వీసును తొలగించి కేసులు పెట్టాలని ఎంపీపీ సూచించారు.
- పాలమంగళం నార్త్ వద్ద నదిపై వంతెన పనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ అధికారులను కోరారు.
- పెండింగ్ పనులను పూర్తి చేసి నారాయణవనంలో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని త్వరలో ప్రారంభించాలని ఎంపీపీ, జడ్పీటీసీలు అధికారులకు వివరించారు.
- తమ ప్రమేయం లేకుండా తీర్మానాలు చేసుకుని సంతకాలకే మాత్రం వస్తున్నారని పలువురు సర్పంచ్‌లు వాపోయారు. స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు ఉందని, సర్పంచ్‌ల అధ్యక్షతన సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేయాలని ఆదేశించారు.